క్లుప్తంగా

ఆర్బీకేల్లో వరి విత్తనాలు



ఇంగిలాపల్లి ఆర్బీకేలో ఉన్న వరి విత్తనాలను పరిశీలిస్తున్న ఏఓ అనురాధ

దత్తిరాజేరు: రానున్న ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు అవసరమైన వరి విత్తనాలను ఆర్బీకేల్లో సిద్ధంగా ఉంచినట్లు ఏఓ అనురాధ శుక్రవారం తెలిపారు. మండల వ్యాప్తంగా 17 సచివాలయాల పరిధిలో సుమారు 36 వేల మంది రైతులు 9 వేల ఎకరాల్లో వరిసాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. వారికి 27 వేల క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరమవుతాయని గుర్తించి, వాటిని ముందుగానే తెప్పించి ఆర్బీకేల్లో భద్రపరిచినట్లు చెప్పారు. రైతుల అవసరాలకు అనుగుణంగా మరిన్ని విత్తనాలు తెప్పించేందుకు సిద్ధంగా ఉన్నమన్నారు.

శరవేగంగా రోడ్డు విస్తరణ పనులు



గరివిడి ప్రధాన రహదారి నుంచి వెదుళ్లవలస మీదుగా చేపడుతున్న బీటీరోడ్డు విస్తరణ పనులు

మెరకముడిదాం: మండలంలోని గర్భాం, గరివిడి ప్రధాన రహదారి నుంచి సిరియాలపేట జంక్షన్, బిళ్లలవలస, గరివిడి మండలం వెదుళ్లవలస, బోగవలస మీదుగా చీపురుపల్లి వరకు సుమారు 15 కిలోమీటర్ల మేర చేపడుతున్న బీటీరోడ్డు విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన నిధులు రూ.8.76 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నారు. రహదారి విస్తరణతో పాటు 10 కల్వర్టులను కొత్తగా నిర్మిస్తున్నారు. ఈ పనులు పూర్తయితే మండల ప్రజలు తక్కువ సమయంలోనే నియోజకవర్గ కేంద్రమైన చీపురుపల్లి చేరుకోవచ్చు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏఓ రవీంద్ర

శృంగవరపుకోట: రైతులకు రాయితీపై పచ్చిరొట్ట, నవధాన్యాల విత్తనాలు అందిస్తున్నట్లు వ్యవసాయశాఖ అధికారి రవీంద్ర తెలిపారు. మండలంలోని వినాయకపల్లి గ్రామంలో శుక్రవారం రైతులకు పచ్చిరొట్ట, నవధాన్యాల విత్తనాలు పంపిణీ చేశారు. ఖరీఫ్ వరిసాగుకు ముందుగా వీటిని పొలంలో చల్లుకొని, 40 నుంచి 50 రోజుల తరువాత భూమిలో కలియదున్నడం వల్ల భూసారం వృద్ధి చెందుతుందన్నారు. దీని వల్ల వరిసాగులో రసాయన ఎరువుల వినియోగం, సాగు ఖర్చులు తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో వీఏఏ రవి, జెడ్పీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.


శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు



లింగాలవలస గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ ప్రభాకర

గజపతినగరం: ఎన్నికల ఫలితాల అనంతరం గ్రామాల్లో ఎటువంటి ర్యాలీలు చేపట్టరాదని సీఐ ప్రభాకరరావు అన్నారు. మండలంలోని లింగాలవలస గ్రామస్తులతో గురువారం రాత్రి సమావేశమై మాట్లాడారు. ఫలితాలు వచ్చిన తరువాత ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు నిర్వహించరాదని, బాణసంచా కాల్చరాదని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొనేలా స్థానికులు పోలీసులకు సహకరించాలని కోరారు. ఆయన వెంట ఎస్సై మహేష్, సిబ్బంది ఉన్నారు.

గుర్లలో భారీ వర్షం



ఆకాశంలో కమ్ముకున్న నల్లని మేఘాలు

గుర్ల: మండలంలోని కెల్ల, గుర్ల, గుజ్జింగివలస, కోటగండ్రేడు, ఆనందపురం, తదితర గ్రామాల్లో శుక్రవారం ఈదురుగాలులతో పాటు భారీ వర్షం కురిసింది. గత కొన్ని రోజులుగా ఎండ తీవ్రతకు ఇబ్బందులు పడుతున్న ప్రజలు ఈ వర్షానికి సేదతీరారు. మధ్యాహ్నం వరకు ఎండగా ఉన్న వాతావరణం సాయంత్రం ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశంలో నల్లని మబ్బులు కమ్ముకోవడంతో ప్రకృతి ఎంతో ఆహ్లాదంగా కనువిందు చేసింది.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



శాస్త్రీయ నృత్యంలో శిక్షణ పొందుతున్న చిన్నారులు



సంగీతంలో శిక్షణ ఇస్తున్న ఇన్‌స్ట్రక్టర్



చిత్రలేఖనంలో శిక్షణ

- బాలభవన్‌లో కొనసాగుతున్న వేసవి శిక్షణా శిబిరం
- నృత్యం, సంగీతం, చిత్రలేఖనంలో శిక్షణ

చీపురుపల్లి: పట్టణంలోని బాలభవన్ కేంద్రంలో చిన్నారులకు ఏర్పాటు చేసిన వేసవి శిక్షణా శిబిరం కొనసాగుతోంది. వేసవి సెలవుల్లో విద్యార్థులు టీవీలు, మొబైల్ ఫోన్లకు అతుక్కుపోయి సమయాన్ని వృథా చేసుకోకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో బాలభవన్ కేంద్రాలు, శాఖాగ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా స్థానిక బాలభవన్‌లో చిన్నారులకు శాస్త్రీయ సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, వంటి వాటిల్లో శిక్షణ ఇస్తున్నారు. సుమారు 300 మందికిపైగా చిన్నారులు శిబిరానికి హాజరవుతున్నట్లు బాలభవన్ డైరెక్టర్ డా.సుంకరి రమేష్ తెలిపారు. వచ్చే నెల 10వ తేదీ వరకు శిబిరం కొనసాగుతుందన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నేతలు

చీపురుపల్లి: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) నేతృత్వంలో నిర్వహించనున్న విద్యా సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆ సంఘ నాయకులు శుక్రవారం విడుదల చేశారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రం ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మీసాల అప్పలనాయుడు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూటీఎఫ్ పూర్వపు జిల్లా అధ్యక్షుడు దివంగత కె.శేషగిరి 3వ వర్ధంతి సందర్భంగా ఈ నెల 27న ఉదయం 9.30 గంటలకు జిల్లా కేంద్రంలోని కేఎల్‌పురంలో నిర్మాణంలో ఉన్న శేషగిరి విజ్ఞాన కేంద్రం ఆవరణలో రాష్ట్ర స్థాయి విద్యా సదస్సు నిర్వహించనున్నట్లు చెప్పారు. 'విద్యా రంగంలో పరిణామాలు–సవాళ్లు' అనే అంశంపై నిర్వహించే ఈ సదస్సుకు శాసన మండలి ప్రోటెం స్పీకర్‌గా పనిచేసిన విఠపు బాలసుబ్రహ్మణ్యం ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు. అలాగే యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్.ప్రసాద్ కూడా హాజరుకానున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని యూటీఎఫ్ నాయకులు, సభ్యులు ఈ సదస్సులో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ ఆలమూరు సత్యశ్రీనివాస్, జిల్లా కార్యదర్శి సూరు శ్రీనివాస్, చీపురుపల్లి, గరివిడి మండలాల ప్రతినిధులు మీసాల రవికుమార్, మామిడి శ్రీనివాసరావు, దువ్వాడ కృష్ణమూర్తి, చింత రామకృష్ణ, ఐక సత్యనారాయణ, సుంకరి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



విద్యా సదస్సు కరపత్రాలు విడుదల చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

జామి: ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మిక వర్గాల సమస్యలపై పోరాడిన ఉద్యమనేత కె.శేషగిరి తృతీయ వర్ధంతిని ఈనెల 27న విజయగనరం శేషగిరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను స్థానిక ఎంఈఓ కార్యాలయం వద్ద యూటీఎఫ్ నేతలు శుక్రవారం విడుదల చేశారు. కార్యక్రమంలో విఠపు బాలసుబ్రహ్మణ్యం, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొంటారని తెలిపారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు, జిల్లా కార్యదర్శి జి.రాజారావు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.వాసుదేవరావు, ఎం.తాతంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మండలానికి చేరిన పాఠ్యపుస్తకాలు

మెరకముడిదాం: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న 4,474 మంది విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు మండలానికి చేరుకుంటున్నాయి. మొదటి విడతగా 8వ తరగతికి చెందిన 577 పాఠ్యపుస్తకాలు వచ్చాయని మండల విద్యాశాఖ సిబ్బంది తెలిపారు. మిగిలిన పుస్తకాలు త్వరలోనే రానున్నాయని తెలిపారు. పాఠశాలలు పునఃప్రారంభం నాటికి పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

178 మందికి వైద్యసేవలు

జామి: మండల కేంద్రంలోని సచివాలయం–3 పరిధిలో శుక్రవారం ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. జామి పీహెచ్‌సీ వైద్యాధికారి నాగశ్వేత ఆధ్వర్యంలో వైద్యులు బి.మహేష్, నాగమణి 178 మందికి వైద్య సేవలందించారు. మందులు అవసరమైన వారికి ఉచితంగా పంపిణీ చేశారు. వేసవి ఎండల దృష్ట్యా వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య సహాయకులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగ పిల్లల గుర్తింపు సర్వే

జామి: సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో మండల పరిధిలో ఉన్న దివ్యాంగ పిల్లల గుర్తింపు సర్వే చురుగ్గా జరుగుతోంది. ఐఈఆర్టీలు బి.నారాయణరావు, ఎస్.దేవి గ్రామాల్లో పర్యటించి ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను గుర్తించారు. ఇప్పటివరకు 11 మంది దివ్యాంగ పిల్లలను గుర్తించినట్లు చెప్పారు. జూన్ 9 వరకు సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి గ్రామంలోని దివ్యాంగుల వివరాలు సేకరిస్తున్నట్లు చెప్పారు.

ప్రజలకు చేరువైన సేవలు..



పూసపాటిరేగ సచివాలయం



ప్రజలకు సేవలు అందిస్తున్న సిబ్బంది

పూసపాటిరేగ మండలం	పరిస్థితి
మండల జనాభా :	79,815
పంచాయతీలు :	28
సచివాలయాలు :	22
సచివాలయాల సిబ్బంది :	211 మంది

పూసపాటిరేగ : ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి కృషి ఫలితంగా మహాత్మా గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాకారమైంది. ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు పారదర్శకంగా సేవలు అందుతున్నాయి. మండలంలో 22 సచివాలయాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరువ చేశారు. అలాగే ఆయా సచివాలయాల పరిధిలో రైతుభరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు అందుబాటులో తీసుకువచ్చారు. ఒక్కో సచివాలయాన్ని సుమారు 45 లక్షల రూపాయలతో నిర్మించారు. రేషన్‌కార్డు నుంచి పట్టాదారు పాసు పుస్తకం వరకు.. జనన, కుల, ఆదాయ ధ్రువపత్రాలు సైతం సచివాలయాల్లో క్షణాల్లో అందిస్తున్నారు. ప్రతి పంచాయతీలో ప్రజలు తమ సమస్యలను స్థానికంగానే సులువుగా పరిష్కరించకోవచ్చు. గతంలో ఏ సర్టిఫికెట్ కావాలన్నా , ఏ పని జరగాలన్నా మండల, జిల్లా కేంద్రాలకు తిరగాల్సి వచ్చేంది. ప్రస్తుతం సచివాలయ వ్యవస్థతో ఉన్న ఊరిలోనే అన్ని సేవలూ పొందవచ్చు.

సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం



మెరకముడిదాం: ఇంటర్మీడియట్ బెటర్‌మెంట్ పరీక్షకు హాజరైన విద్యార్థినులు

మెరకముడిదాం: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. మండలంలోని సోమలింగాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో సోమవారం జరిగిన పరీక్షకు ఫస్ట్ ఇయర్ నుంచి 88 మంది, సెకండ్ ఇయర్ నుంచి 66 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ పిల్లా శ్రీనివాసరావు తెలిపారు. మొదటిరోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయన్నారు.

● గజపతినగరం: మండలంలో మూడు కేంద్రాల్లో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. గజపతినగరం ప్రభుత్వ జూనియర్ కాలేజీ కేంద్రంలో తొలిరోజు 126 మంది, సాయిసిద్ధార్థ కాలేజీలో 64 మంది, శ్రీకృష్ణ కాలేజీలో 59 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రకాశరావు పట్నాయక్ తెలిపారు.

కోళ్లఫారం వ్యర్థాలతో అవస్థలు



కేజీబీవీ సమీపంలో చెరువు గట్టుపై వేసిన కోళ్లఫారం వ్యర్థాలు

మెరకముడిదాం: మండల కేంద్రంలో కోళ్లఫారాలు నిర్వహిస్తున్న కొందరు వ్యక్తులు వాటి వ్యర్థాలను స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం సమీపంలో ఉన్న కోనేరు గట్టుపై పారబోస్తుండటంతో పాఠశాల విద్యార్థులతో పాటు అటుగా వెళ్లేవారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసన రావడంతో పాటు వ్యర్థాలతో చెరువునీరు కలుషితమవుతోందని, ప్రజలు రోగాల బారిన పడుతున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇదే విషయమై పంచాయతీ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కొన్నాళ్లు కోళ్లఫారాల యజమానులు ఇక్కడ వ్యర్థాలు వేయడం మానేశారని, ఇప్పుడు మళ్లీ మొదలు పెట్టారని వాపోయారు. భారీగా వ్యర్థాలు డంప్ చేస్తుండటంతో చెరువు వైపు వెళ్లలేకపోతున్నామని అంటున్నారు. ఇప్పటికైనా పోలీసులు, పంచాయతీ అధికారులు స్పందించి కోళ్ల వ్యర్థాలు వేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారంతా కోరుతున్నారు.

అక్రమంగా కలప తరలింపు



ట్రాక్టర్‌పై తరలిస్తున్న కలప

శృంగవరపుకోట: ఎటువంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ స్థలాల్లోని చెట్లను యథేచ్ఛగా నరికేస్తున్నా.. రెవెన్యూ యంత్రాంగం తమకు పట్టనట్లు వ్యవహరిస్తోందని పలువురు రైతులు, జియో సంస్థ వ్యవస్థాపకులు బి.రామకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్.కోట పట్టణంలోని రాజు చెరువు స్థలంలో పెరిగిన చెట్లను శుక్రవారం కొందరు వ్యక్తులు అక్రమంగా నరికేసి కలప తరలించుకుపోతుండగా రైతులు అడ్డుకున్నారు. దీనిపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. చెట్లు అక్రమంగా నరికేసిన వ్యక్తులు చెరువు స్థలాన్ని ఆక్రమించి చదును చేస్తున్నారని, గతంలో కూడా దీనిపై అప్పటి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. ప్రస్తుతం అధికార యంత్రాంగం అంతా ఎన్నికల హడావిడిలో ఉండటంతో ఆక్రమణదారులు చెట్లు నరికేసి తరలించేస్తున్నారని ఫిర్యాదుదారులు ఎస్.సూరిబాబు, వసంత సత్యారావు, మోపాడ శ్రీను, చిప్పాడ శేషగిరిరావు, అప్పారావు, లక్ష్మి తదితరులు చెప్పారు. గత కొన్ని రోజులుగా ఈ వివాదం నడుస్తున్నా స్థానిక రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చదును చేసిన స్థలం జిరాయితీనా, ప్రభుత్వ స్థలమో నిర్ధారించాలని, అక్రమంగా చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్



పేకాట ఆడుతూ పట్టుబడిన వారితో పోలీసులు

దత్తిరాజేరు: మండలంలోని టి.భూర్జవలస సమీపంలో ఉన్న మామిడి తోటలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు పెదమానాపురం ఎస్సై శిరీష్ తెలిపారు. ముందుగా అందిన సమాచారంతో పేకాట శిబిరంపై దాడి చేసినట్లు చెప్పారు. ఆ సమయంలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పట్టుకుని, వారి వద్ద రూ.73,600ల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

పశువులకు ఎండ దెబ్బ...

- వేసవిలో జాగ్రత్తలు తప్పనిసరి
- పాడి పశువుల రక్షణకు ప్రత్యేక చర్యలు

భోగాపురం: వాతావరణంలో ఉష్ణోగ్రతలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. దీంతో మూగజీవాల పరిస్థితి దయనీయంగా మారుతోంది. ఈ సమయంలో పశు పోషణలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. లేకుంటే అవి అనారోగ్యానికి గురై పాల దిగుబడి తగ్గిపోతుందని పశు వైద్యాధికారులు చెబుతున్నారు. సాధారణంగా పశువుల శరీర ఉష్ణోగ్రత 36 నుంచి 38 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉంటుంది. వేసవిలో ఇది కాస్త ఎక్కువగా ఉంటుంది. పశువులకు జ్వరం వచ్చిందంటే త్వరగా నీరసించిపోతాయి. ఉష్ణోగ్రత మరీ ఎక్కువైతే నాడీ వ్యవస్థ పని చేయదు. ఎప్పటికప్పుడు చల్లని నీటితో తుడిచి మందులు వేయించాలి. అధిక ఉష్ణోగ్రత వల్ల పశువులు మేత తినడం తగ్గించేస్తాయి. ఫలితంగా రక్తంలో గ్లూకోజ్ పరిమాణం పడిపోయి పాల ఉత్పత్తి తగ్గిపోతుంది. వాతావరణంలో మార్పుల ప్రభావం పశువులపై వెంటనే కనిపిస్తుంది. అలాగే మూత్ర విసర్జన తగ్గిపోవడం, గాలికుంటు వ్యాధులు సోకడం జరుగుతాయి. గర్భం దాల్చిన పశువుల్లో హార్మోన్ల ప్రభావం వల్ల పిండం దెబ్బతినే అవకాశం ఉంటుంది.

జాగ్రత్తలు తప్పనిసరి..




పశువుల పాక విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలి. వేడిగాలులు నేరుగా తాకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఉదయం 10 గంటల్లోపు, సాయంత్రం ఐదు గంటల తర్వాత మాత్రమే పశువులను బయట కట్టాలి. ఒక్కో పశువుకు రోజుకు 40 లీటర్ల నీరు అందించాలి. సాయంత్రం వేళల్లో పశువులను చెరువుల్లో వదలాలి. పగలు పచ్చగడ్డి, రాత్రి ఎండుగడ్డి వేస్తే మంచిది. ఉదయం సాయంత్రం దాణా పెట్టాలి. కనీసం రోజుకు 50 గ్రాముల మినరల్ మిక్చర్ అందించాలి. దీనివల్ల వేసవిలో ఒత్తిడి ప్రభావం తగ్గుతుంది. గాలికుంటు వ్యాధి టీకాలు క్రమం తప్పకుండా వేయించాలి.

– వి రామరాజు,
పశువైద్యాధికారి, భోగాపురం మండలం

తాగునీటి సమస్యకు చెక్..

- జూన్ నెలాఖరు వరకు నో ప్రాబ్లమ్
- అవసరానికి సరిపడా తాగునీటి నిల్వలు
- చంపావతిలోకి 150 క్యూసెక్కుల ఆంధ్ర రిజర్వాయర్ నీరు
- ప్రతిరోజూ 27 ఎంఎల్‌డీ నీరు పంపింగ్ చేసి ప్రజలకు సరఫరా
- గడిచిన ఐదు వేసవుల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు



దాసన్నపేట ప్రాంతంలో నిర్మించిన వాటర్ ట్యాంక్

రోజు విడిచి రోజు ..

మండు వేసవిలో కూడా నగర ప్రజలకు రోజు విడిచి రోజు కుళాయిల ద్వారా తాగునీటి సరఫరా చేస్తున్నాం. చంపావతి నదిలో నీటి నిల్వలు అడుగంటిపోయే సమయానికి ఆంధ్ర రిజర్వాయర్ నుంచి మూడు విడతల్లో 150 క్యూసెక్కుల నీటిని మళ్లించేలా చర్యలు చేపట్టాం. మూడు రక్షిత మంచి నీటి పథకాల వద్ద నిర్వహణ పనులు చేశాం. ఇప్పటికీ వర్షాలు కురవకున్నా తాగునీటి సమస్య లేకుండా ముందస్తు చర్యలు తీసుకున్నాం. ఇటీవల ముషిడిపల్లి రక్షిత మంచినీటి పథకం నుంచి నీటిని పంపింగ్ చేసే పైప్‌లైన్‌లు పగిలిపోవడంతో 38 గంటల్లో సమస్యను పరిష్కరించాం. జూన్ నెలాఖరు వరకు వర్షాలు కురవకున్నా నీటి సరఫరాలో ఇబ్బంది ఉండదు.

– ఎస్.అప్పారావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, విజయనగరం కార్పొరేషన్

విజయనగరం: గడిచిన ఐదేళ్లలో నగర ప్రజలకు తాగునీరు సరఫరా చేయడంలో పాలకులు, అధికారులు చేపట్టిన చర్యలు ఫలించాయి. ముందస్తుగా రూపొందించిన ప్రణాళికలను పక్కాగా అమలు చేయడంతో మండు వేసవిలో సైతం రోజు విడిచి రోజు నీటి సరఫరా చేయడంలో సఫలీకృతులయ్యారు. ప్రస్తుత సంవత్సరం వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో నగరానికి తాగునీటిని అందించే చంపావతి నదీ తీరంలో నీటి నిల్వలు అడుగంటిపోయాయి. దీంతో ఎగువున ఉన్న ఆంధ్ర జలాశయం నుంచి నీటిని మళ్లించి ప్రజల దాహార్తిని తీర్చారు. చంపావతి నదితో పాటు ముషిడిపల్లి రక్షిత మంచినీటి పథకాల వద్ద జూన్ నెలాఖరు వరకు యథావిధిగా రోజు విడిచి రోజు నీటి సరఫరా చేసేందుకు అవసరమయ్యే నీటి నిల్వలు ఉన్నట్లు అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

3 లక్షలకు పైగా జనాభా..

విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 50 డివిజన్‌లు ఉండగా... 3 లక్షలకు పైగా జనాభా నివసిస్తున్నారు. అధికారిక లెక్కల ప్రకారం నగరంలో పబ్లిక్ కుళాయిలు 425 వరకు ఉండగా... వ్యక్తిగత కుళాయిల సంఖ్య 34 వేల పైచిలుకే ఉన్నాయి. నగర ప్రజలకు తాగునీటి సరఫరా చేసేందుకు నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలో చంపావతి నదితో పాటు గంట్యాడ మండల పరిధిలో గల ముషిడిపల్లి రక్షిత మంచినీటి పథకాల నుంచి ప్రతిరోజూ నీటిని పంపింగ్ చేస్తున్నారు. ఆ మొత్తాన్ని నగరంలోని 34 రిజర్వాయర్లకు పంపింగ్ చేసి అక్కడి నుంచి కుళాయిల ఒక రోజు 25 డివిజన్‌లకు, మరో రోజు 25 డివిజన్‌లకు నీటిని అందిస్తున్నారు. ఇందులో నెల్లిమర్ల, రామతీర్థం, కుదిపి రక్షిత మంచినీటి పథకాల వద్ద 8 బావుల నుంచి 17 ఎంఎల్‌డీ నీటిని పంపింగ్ చేస్తుండగా.... ముషిడిపల్లి వద్ద ఉన్న 10 బావుల నుంచి మరో 10 ఎంఎల్‌డీ నీరు పంపింగ్ అవుతోంది. వాస్తవానికి నగరంలో ఉన్న రిజర్వాయర్లలో రోజుకు 20 ఎంఎల్‌డీ నీటిని మాత్రమే నిల్వ ఉంచే సామర్థ్యం ఉండగా.. మిగిలిన 7 ఎంఎల్‌డీ నీటిని నేరుగా ఆయా రిజర్వాయర్లకు పంపింగ్ చేసి అక్కడి నుంచి కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్నారు. నెల్లిమర్ల, రామతీర్థం రక్షిత మంచినీటి పథకాలు ఉండే చంపావతి నదిలో మార్చి నెలాఖరు నాటికి నీటి నిల్వలు అడుగంటిపోగా... ఎగువన ఉన్న ఆంధ్ర రిజర్వాయర్ నుంచి 43 కిలోమీటర్ల దూరంలో గల చంపావతి నదిలోకి 150 క్యూసెక్కుల నీటిని మళ్లించారు.

మెరుగుపడిన తాగునీటి సరఫరా..

50 డివిజన్‌లుగా విస్తరించిన విజయనగరం కార్పొరేషన్‌లో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా చేపట్టిన చర్యలు సత్ఫాలితాలనిచ్చాయి. ఇందులో భాగంగా గాజులరేగ, ధర్మపురి, కేఎల్‌పురం, బాలాజీనగర్, దాసన్నపేట, ఫూల్‌బాగ్ ప్రాంతాల్లో రూ.10 కోట్లతో 45 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన 11 వాటర్ ట్యాంక్‌లు నిర్మించి ఆయా ప్రాంత ప్రజలకు కుళాయిల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. 2019 ఎన్నికలకు ముందు నగర వ్యాప్తంగా 18,000 కుళాయిలు ఉండగా.... గడిచిన నాలుగున్నరేళ్లలో నూతనంగా 16,000 కుళాయి కనెక్షన్‌లు మంజూరు చేశారు.